క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణోత్సవం

తోట్లవల్లూరు: శ్రీగోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణోత్సవం శనివారం ఘనంగా జరిగింది. తోట్లవల్లూరు–ఉయ్యూరు ప్రధాన రహదారిలో బందరుకాలువ వంతెన వద్ద ఉన్న ఆలయంలో అమ్మవారి కల్యాణం వేడుకగా సాగింది. వేదపండితుడు రవి ఆధ్వర్యంలో చిప్పల రాము, కుమారి దంపతులు పీటలపై కూర్చుని గోపయ్య తిరుపతమ్మ కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చిప్పల పాపాయమ్మ, లక్ష్మణరావు, కర్ణా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జోరుగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు

పామర్రు: గ్రామంలోని బాపూజీ పేట బీసీ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను శనివారం ఆర్బీకే మండల చైర్మన్ ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.10 లక్షలతో కాలనీలో సుమారు 150 మీటర్ల వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టుబోర్డు జిల్లా సభ్యులు కృష్ణారెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు హస్మతుల్లా, రైతు నాయకులు మాధవరెడ్డి, శేషిరెడ్డి పాల్గొన్నారు.

దాత సహకారంతో బోరుకు మరమ్మతులు

పామర్రు: స్థానిక హిందూ శ్మశాన వాటిలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరు కొంత కాలంగా పనిచేయడం లేదు. ఈ నేపథ్యంలో శనివారం బొమ్మారెడ్డి వెంకట రమణారెడ్డి మాతృమూర్తి కోటేశ్వరమ్మ(80) మృతి చెందారు. శ్మశాన వాటికకు తీసుకొచ్చి దహన సంస్కారాలను చేస్తుండగా ఇక్కడ బోరు పాడైపోయి నీరు రావటం లేదని స్థానికులు వివరించారు. స్పందించిన వెంకటరమణారెడ్డి వెంటనే బోరు మరమ్మతులకు రూ.10వేలతో అవసరమైన వస్తువులను తీసుకొచ్చి బాగు చేయించారు.

పాస్టర్లు సమాజ సేవలో పాల్గొనాలి

పామర్రు: పాస్టర్లు ప్రభువు సేవతో పాటు సమాజ సేవలో పాలు పంచుకోవాలని ఏఐసీసీ మండల పాస్టర్స్ అధ్యక్షుడు రెవ.కె యేసుదాసు పేర్కొన్నారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో పాస్టర్ల కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. పాస్టర్లు స్వామియేలు, పురుషోత్తం, విద్యాసాగర్, ఇసాఏలు, సురేష్ పాల్గొన్నారు.

రేపు భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

తోట్లవల్లూరు: దేవరపల్లిలోని కోదండరామస్వామి ఆలయంలో సోమవారం నూతన ధ్వజస్తంభం, భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేదపండితుడు అద్దేపల్లి ఫణిభూషణ మంగాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం 10.10 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అన్నదానం జరుగుతుందని తెలిపారు.

రాజీమార్గంతో కేసుల పరిష్కారం ఉత్తమం


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి పూర్ణిమ

గుడివాడ టౌన్: రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారం ఉత్తమమని సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ అన్నారు. కోర్టు ప్రాంగణంలో పోలీస్ అధికారులు, న్యాయవాదులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 9వ తేదీ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. అందులో పెద్ద మొత్తంలో కేసులు పరిష్కరించుకునేందుకు పోలీసులు, న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం ఎంతో సులువనే విషయాన్ని కక్షిదారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె. నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. శ్రీనివాస్, లోక్ అదాలత్ సభ్యులు మురళి, రహమ్‌తుల్లా, సీహెచ్ కుటుంబరావు, మహ్మద్ రఫీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే కైలే


అమీనపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పమిడిముక్కల: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మండలంలోని అమీనపురంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లు పంపిణీ చేశారు. మాట తప్పని, మడమ తిప్పని నేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, నాయకులు కోటంరాజు, రంగరాజు, రాము, శంకరరావు, సత్యనారాయణరాజు, పరసా శ్రీను, రాణి పాల్గొన్నారు.

రూ.కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు


శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: పట్టణంలోని ప్రధాన రహదారులు రూ.కోట్లు వెచ్చించి మరమ్మతులు, నిర్మాణ పనులు చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. శనివారం స్థానిక 4వ వార్డు గౌరీశంకర్ సెంటర్ నుంచి ముగ్గు బజారు వరకు రూ. 83 లక్షలు, 15వ వార్డులోని పామర్రు రోడ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి బంటుమిల్లి రోడ్ ముబారక్ సెంటర్ వరకు రూ.82 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. నాయకులు మాట్లాడుతూ పట్టణంలో పలురోడ్లు గుంతలు ఏర్పడ్డాయని వాటిని పూర్తిగా సీసీ రోడ్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) రూ. 24 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. మున్సిపల్ ఇంజినీర్ విజయదుర్గ, డీఈ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, పార్టీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మలిరెడ్డి రవి, ఎంపీపీ ఆదాం, మాజీ కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, క్షయ నివారణపై అవగాహన

తోట్లవల్లూరు: హెచ్ఐవీ, క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలని కళాకారులు సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వల్లూరుపాలెంలో ఎయిడ్స్, క్షయపై కళాజాతా ప్రదర్శన శనివారం జరిగింది. ఎయిడ్స్, క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కళాకారులు వివరించారు. కళాకారులు శేఖర్‌బాబు, వీరయ్య, రవితేజ, చిరంజీవి, ప్రసాద్, కుమార్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

మండవల్లి: ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తక్కెళ్లపాడు పీహెచ్‌సీ డాక్టర్ సుమ, సూపర్‌వైజర్ రహీమ్ పేర్కొన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో శనివారం ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో వారు మాట్లాడారు. అనంతరం ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. హెచ్‌వీ నాగమణి పాల్గొన్నారు.

ఆంధ్రాలో ఆక్వా సాగు అదుర్స్

కైకలూరు: ఆంధ్రప్రదేశ్ ఆక్వారంగానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో అధిక దిగుబడులతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలంగాణ ఫిషరీస్ విద్యార్థులు, ప్రొఫెసర్లు ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డిపార్టుమెంట్ ఆఫ్ జువాలజీకి చెందిన ఎఫ్‌జడ్‌సీ గ్రూపునకు చెందిన మొదటి, ద్వితీయ, తృతీయ విద్యార్థులు 30 మంది ఆక్వా పరిశ్రమ పరిశీలన నిమిత్తం కైకలూరు శనివారం విచ్చేశారు. ఆటపాక గ్రామంలో సురేష్‌రాజుకు చెందిన 25 ఎకరాల చేపల చెరువు, అదే విధంగా గోనెపాడులో సాయికి చెందిన చేప పిల్లల నర్సరీని సందర్శించారు. అనంతరం కైకలూరు మత్స్యశాఖ కార్యాలయంలో మంచినీటి చేప, రొయ్యల వ్యాధి నిర్ధారణ లాబోరేటరీలో విద్యార్థులకు స్థానిక ఫిషరీస్ డెవలప్‌మెంటు ఆఫీసరు(ఎఫ్‌డీఓ) భవిత చేపలు, రొయ్యల్లో వచ్చే సాధారణ వ్యాధులు, నివారణ, మందుల పరీక్షల విధానాలను ప్రయోగాత్మకంగా వివరించారు. తెలంగాణ నుంచి విద్యార్థులతో పాటు వచ్చిన ప్రొఫెసర్లు సురేష్, మహేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రూ.200 కోట్లతో ఫిషరీష్ హబ్‌ను నిర్మించనుందన్నారు. మొదటి బ్యాచ్ విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో ఆక్వా పరిశ్రమపై అవగాహన కలిగించేందుకు కైకలూరు ప్రాంతానికి తీసుకొచ్చామన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సంధ్య అన్నారు. మండలంలోని సింగరాయపాలెం, పెదపాలపర్రు జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలకు సంబంధించి పూర్తి యాజమాన్యపు హక్కులతో రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్నందున స్థానిక సచివాలయాల్లో ఇందుకు సంబంధించి ప్రక్రియను పూర్తిచేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ


చికిత్సపొందుతున్న భరత్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: మండల పరిధి పెద మద్దాలి గ్రామ ఎంపీటీసీ కాకొళ్ల రాజ్యలక్ష్మీ భర్త భరత్ విజయవాడ సెంటినీ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ వెంటనే శనివారం విజయవాడలోని హాస్పిటల్‌కు వెళ్లి భరత్‌ను పరామర్శించారు. అక్కడి వైద్యులతో భరత్ ఆరోగ్య విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని అండగా ఉంటానన్నారు. అనంతరం భరత్‌కు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఆరోగ్యశ్రీ కార్డుల అందజేత

మండవల్లి: మండవల్లి గ్రామ సచివాలయం వద్ద ఆరోగ్యశ్రీ కార్డులను సర్పంచ్ మెండా ఝాన్సీ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా వైద్యం చేయించుకోవడం వలన ఏ ఆస్పత్రిలోనైనా వైద్య సేవలు ఉచితంగా పొందే అవకాశం ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపారమైన ప్రేమాభిమానాలు ఉన్నాయన్నారు. అందుకే పేదలు మెరుగైన సేవలు పొందేందుకు వీలుగా ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

పమిడిముక్కల: వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ కాసాని వేద సుప్రజ, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వీరంకిలాకు కల్యాణ మండపంలో శనివారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. వలంటీర్లకు సేవా వజ్రం, సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, ఏఓ రాజు, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు పాల్గొన్నారు.

చావలిపాడులో ప్రజా ఆశీర్వాద యాత్ర

మండవల్లి: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా 6వ రోజు శనివారం చావలిపాడులో ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) మాట్లాడుతూ చెప్పినట్లుగా పథకాలు అమలుజేసి, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సేవలు అందజేస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం రూ.26 లక్షల 80వేలతో నిర్మాణం పూర్తి చేసుకున్న సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు పాల్గొన్నారు.

లోకుమూడిలో..

మండవల్లి: లోకుమూడిలో ప్రజా ఆశీర్వాదయాత్ర ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం జరిగింది. తొలుత రూ.లక్షా 80 వేల నిధులతో అంతర్గత సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 20మంది డీఎన్నార్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

ముదినేపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 27వ తేదీ వరకు జరగనున్న ఎఫ్ఏ–4 పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని ఎంఈఓ నరేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పెయ్యేరు ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు బేతాళ రాజేంద్రప్రసాద్ పాఠశాల ప్రగతిని వివరించారు.

ఓటు హక్కుపై అవగాహన

మండవల్లి : మూడుతాళ్లపాడులో శనివారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్యాన్ని బలపరుద్దాం అని కైకలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ లీడర్ సీహెచ్ చెల్లెమ్మ అన్నారు. సీడీపీఓ, సెక్టార్ సూపర్‌వైజర్ ఆదేశాల మేరకు ఓటు విలువ తెలిపేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎం పద్మజ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కలిదిండి: అమరావతి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ పి. ప్రభాకరరావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో సరిపడా బెంచీలు ఉండగా పిల్లలను క్రింద కూర్చోబెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో మాట్లాడుతూ 38 మంది విద్యార్థులకుగాను 36 మంది హాజరుకాగా 19 డ్యుయల్ డెస్కులు ఉన్నాయన్నారు. అవి అందరికీ సరిపోతాయని తెలిపారు. సిబ్బంది సతీష్‌కుమార్‌కు నోటీస్ ఇచ్చినట్లు చెప్పారు.

అధునాతన సౌకర్యాలతో రుద్రభూమి


రుద్రభూమి కట్టడాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, కమిటీ సభ్యులు

కైకలూరు: అధునాతన సౌకర్యాలతో రుద్రభూమి (హిందూ శ్మశాన వాటిక) మార్చి 2న ప్రారంభించనున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తెలిపారు. రుద్రభూమి ఏర్పాట్లపై నిర్మాణ కమిటీతో ప్రాంగణం వద్ద సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పూర్వం నుంచి కైకలూరు హిందూ శ్మశాన వాటికను మార్పు చేయాలనే అభిప్రాయం ఉందన్నారు. ప్రజల అభీష్టం మేరకు దాతల సాయంతో అధునాతన సౌకర్యాలతో రుద్రభూమి పేరుతో హిందూ శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టామన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో రుద్రభూమి నిర్మాణాలను పరిశీలించి అందరికీ ఉపయోగకరమైన కట్టడాలను ఏర్పాటు చేయించామన్నారు. తపస్సు చేస్తున్న శివుని విగ్రహం, జనరేటర్, ఆఫీసు గదులు, దహన సంస్కారాల సమయంలో బంధువులు వేచి ఉండు ప్రాంతం తదితర సౌకర్యాలను కల్పించామన్నారు. నిర్మాణ నిర్వాహకులు ఎమ్మెల్యే డీఎన్నార్ తనయుడు దూలం వీర శ్యామ్ ఫణికుమార్, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, పీఏసీఎస్ అధ్యక్షుడు రాంబాబు, రామలింగ రాజు, శ్రీనివాసరావు, వెంకట శ్రీనివాసరావు, మూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



